ఈనాడు

ఆదివారం 25 ఫిబ్రవరి 2018

అదరగొట్టారు గురూ..

సాంకేతిక ప్రాజెక్టులతో ఆకట్టుకున్న విద్యార్థులు

మద్యం తాగి మత్తులో వాహనం నడుపుతామంటే ఆ శిరస్త్రాణం అడుగు ముందుకు వేయనివ్వదు... మెరిసేవన్నీ తాజా పండ్లు కావు.... అంటూ నాణ్యత గుట్టు విప్పుతుంది ఒక్క ఎల్ ఈడీ బల్బు... చిరు చిట్కాలతో ఎక్వేరియంలో చేపలు ఎన్నాళ్లైనా ఉండొచ్చు. నిర్వహణకు వచ్చిన ఢోకాలేదు... ఆకర్షణీయ నగరమంటే రంగులేసి వెళ్లిపోవడం కాదు... ఎంతైనా అభివృద్ధి చేయవచ్చు... అని చెబుతున్నారు ఈ విద్యార్థులు. వీరి వినూత్న ఆలోచనలకు వేదికైంది కాకినాడ జేఎన్‌టీయూ.

న్యూస్‌టుడే, భానుగుడి సెంటర్ (కాకినాడ)

జేఎన్‌టీయూ, కాకినాడలో జాతీయ స్థాయి సింపోజియం టెక్‌ఫెస్ట్ శుక్రవారం ప్రారంభమైంది. రెండురోజులపాటు జరిగే కార్యక్రమంలో విద్యార్థులు పలు ప్రాజెక్టులు తయారుచేసి ప్రదర్శించారు. ట్రిపుల్‌ఈ, ఈసీఈ, సివిల్ విభాగాలకు చెందిన విద్యార్థులు తాము రూపొందించిన ప్రాజెక్టులతో పలువురి మన్ననలు పొందారు. కార్యక్రమానికి ముఖ్యఅతిథిగా వర్సిటీ రెక్టార్ కె.పూర్ణానందం హాజరై మాట్లాడారు. విద్యార్థులు ఇటువంటి టెక్‌ఫెస్ట్‌లో పాల్గొని జ్ఞాన సముపార్జన పొందాలన్నారు. రిజిస్ట్రార్ వీవీ సుబ్బారావు మాట్లాడుతూ సహజవనరులు వినియోగించుకుని దేశానికి ఉపయోగపడే పరిశోధనలు చేయాలన్నారు. ప్రిన్సిపల్ జీవీఆర్ ప్రసాదరాజు మాట్లాడుతూ ఇక్కడ నేర్చుకున్న అంశాలను మీ కళాశాలలో విద్యార్థులకు తెలియజెప్పాలన్నారు. నిత్య జీవితంలో ఉపయోగపడే అంశాలపై దృష్టి సారించాలన్నారు. కార్యక్రమంలో ప్రోగ్రాం డైరక్టర్లు, విభాగాధిపతులు, విద్యార్థులు పాల్గొన్నారు.

రూపొందించిన శిరస్త్రాణాన్ని ప్రదర్శిస్తున్న విద్యార్థులు

ఈ శిరస్త్రాణం చాలా స్మార్ట్

శిరస్త్రాణం పెట్టుకోండంటూ ప్రభుత్వ ఆదేశాలు ప్రకటనలకే పరిమితమవుతున్నాయి. కేసులు పెడుతున్నా.. లైసెన్సులు రద్దుచేస్తామని చెప్పినా పట్టించుకునేవారు తక్కువ. ఈ సమస్యనూ టెక్నాలజీతో అధిగమించవచ్చని చెబుతున్నారు కేకేఆర్, కేఎస్‌ఆర్ ఇనిస్టిట్యూట్ ఆఫ్ సైన్స్ అండ్ టెక్నాలజీ విద్యార్థులు ఎల్.హరిత్రీ, ఎస్.ప్రవీణ, కె.త్రివేణి, ఎస్‌కే రేష్మ. వీరు ఆల్కాహాల్ డిటక్షన్ స్మార్ట్ హెల్మెట్ (శిరస్త్రాణం) తయారుచేశారు. ఇది దరిస్తే... మద్యం తాగినా, శిరస్త్రాణం ధరించకపోయినా ద్విచక్ర వాహనం లేదా కారు స్టార్ట్ అవ్వదని చెబుతున్నారు. రిసీవర్, డిటెక్టర్, సెన్సార్, ట్రాన్స్‌మీటర్‌ను హెల్మెట్ లోపల అమార్చారు. బండికి హెల్మెట్‌ను అనుసంధానం చేశారు. ఇది పూర్తిగా ఆర్ ఎఫ్ కోడ్‌లో పనిచేసి బండికి సంకేతాలు పంపిస్తుంది. తాగిఉంటే బండి ఇంజను ఆగిపోతుంది. ఇదే పద్ధతి కారుకు కూడా పనిచేస్తుందన్నారు.

ఆకర్షణీయ నగరి

స్మార్ట్‌విలేజ్ అంటే రోడ్డుకు తారుపూయటం, గోడలకు సున్నాలు వేయటమే కాదు. ప్రజలకు అందాల్సిన కనీస సౌకర్యాలు కూడా స్మార్ట్‌గా అందాలని చెబుతున్నారు విశాఖకు చెందిన అనిట్స్ కళాశాల విద్యార్థులు ఎస్.మణికంఠ, ఎం.నాగమణికంఠ, ఎన్.రాజేష్, వై.సునంద. వీరు తయారుచేసిన ప్రాజెక్టులో విలేజ్‌ను ఒక యూనిట్‌గా తీసుకొని అక్కడ అన్నీ స్మార్ట్‌గా... అంటే మానవరహితంగా పనులు చేసేవిధంగా ఈ ప్రాజెక్టును తయారుచేశారు. వాటిలో రైలు వచ్చినపుడు, వెళ్లినపుడు ఆటోమెటిక్‌గా పని చేసే రైల్వేగేటు, వీధిదీపాలు, స్పీడుబ్రేకర్లు నుంచి విద్యుత్తు ఉత్పాదన, సోలార్ పరికరాలు ప్లేట్లు సూర్యుడువైపు తిరిగి సూర్యరశ్మిని గ్రహించేలా, స్మార్ట్ ఇరిగేషన్, వాతావరణ పరిస్థితులు తెలుసుకునేలా తయారుచేశారు. వీటిని ఆర్డినో పరికరం ద్వారా ఇంటర్నెట్‌కు అనుసంధానం చేస్తారు. కేవలం ఒక మనిషి మాత్రమే కంట్రోల్ రూంలో ఉండి పై పనులను పరిశీలిస్తారని చెబుతున్నారు.

ఆకర్షణీయ నగరానికి రూపు

పండ్ల తాజాదనం ఇట్టే తెలుసుకోవచ్చు

బయట మార్కెట్లో లభించే పండ్లు తినాలంటే భయం. ఎందుకంటే ప్రతి పండుకు ఏదొక రసాయనాలు జోడించి వాటిని త్వరగా పరిపక్వతకు తీసుకు వస్తున్నారు. దీనివల్ల పండ్లు తినేవారికి ఏదొక జబ్బులు వస్తున్నాయి. మనం తినే ప్రతి పండు నాణ్యతను తెలుసుకొని తినవచ్చని చెబుతున్నారు ప్రగతి ఇంజినీరింగ్ కళాశాల విద్యార్థులు ఎస్‌ఎస్‌ఎస్ శ్రీదేవి, టి.ప్రసన్న, డీఎస్ ఐక్య దివ్య, జీవీజీ ఎస్‌ఎస్ మహాదేవి. పైకి నిగనిగలాడుతూ కనిపించే పండ్లు మంచివికావు.. రంగులేని పండ్లు చెడ్డవి కాదన్నట్లు... ఇకపై మనం తినే ప్రతి పండుపై మన పేరు రాసుకోవచ్చని అంటున్నారు విద్యార్థులు. ఫ్రూట్స్ కండీషన్ చెకప్‌ను ఈ విద్యార్థులు తయారు చేశారు. వీరు తయారు చేసిన ప్రత్యేక ఎల్‌ఈడీ బల్బును పండ్లకు అనుసంధానం చేస్తారు. అమర్చిన పలు రకాల పండ్లను ఎల్‌ఈడీకి కనెక్ట్‌చేస్తే మంచి పండ్లకు తక్కువ కాంతి, కుళ్లిన, బాగోలేని, ఇంకా లోపల కాయల ఉన్న పండ్లకు ఎక్కువ కాంతి వస్తుంది. యాంప్స్ మీటరు ద్వారా కూడా పండ్ల నాణ్యత తెలుసుకోవచ్చు. వీటిని తాము తయారుచేసిన పరికరాల ద్వారా పండ్లు పరిశ్రమల్లో ఉపయోగించవచ్చు.

పండ్లను తనిఖీ చేసే విధానాన్ని చూపుతున్న విద్యార్థిని

ఈ ఎక్వేరియం నిర్వహణ తక్కువ

ఎక్వేరియంలో చేపలు పెంచడం అందరికీ సరదా. ఎక్కడ రంగు చేప కనపడితే చాలు వెంటనే దాన్ని తీసుకు వచ్చి ఇంట్లో అక్వేరియంలో వేయాల్సిందే. మనం ఎవ్వుడైనా ఊరుకో, షికారుకో వెళితే దాని ఆలనా, పాలనా చూడటం కష్టం. ఇక అటువంటి కష్టాలకు చెక్ పెట్టవచ్చని చెబుతున్నారు శ్రీకాకుళంకు చెందిన జీఎంఆర్‌వీటీ విద్యార్థులు ఐ.మణికంఠ, పి.కౌశిక్, సీ.హెచ్.సాయిరాజు, డి.రముకిరణ్. వేసవి సెలవులు వచ్చాయని చుట్టాలింటికో.. విహార యాత్రలకో వెళుతుంటాం. ఆ సమయంలో అక్వేరియం బాగోగులు చూడటం కష్టం. అటువంటి సమయంలో తాము రూపొందించిన మెయింటెనెన్స్ ఫ్రీ మోడ్రన్ అక్వేరియం బాగా ఉపయోగపడుతుందన్నారు. ఆటోమెటిక్ యంత్రాలతో ఈ అక్వేరియం రోజుకు ఎన్నిసార్లు కావల్సిస్తే అన్నిసార్లు మేత వేస్తుంది. అందులోని మంచినీరు వాసన వచ్చినా.. రంగుమారినా కండీషన్ తెలుసుకొని వ్యర్థపదార్థాలను తొలగించి మంచినీరు మార్చటం దానంతట అదే జరుగుతుంది. సర్క్యూట్‌ను, ఆటోమెటిక్ మోటారును అక్వేరియంకు అనుసంధానం చేసి మేత వేసే సమయం, నీరు మార్చే సమయాన్ని ముందుగా ఫిక్స్‌చేస్తే వాటంతట అవే పని చేసుకుంటాయని విద్యార్థులు చెబుతున్నారు.

రూపొందించిన ఎక్వేరియంతో విద్యార్థుల బృందం